ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 14 జూలై 2024 | 3

పురుగులమందు కలిసిన నీటిని తాగి 12మంది కూలీలకు అస్వస్థత - 5లో

» కరప మండలం వడ్డిపాలెం చెరువుల వద్ద ఘటన

అంతర్వేది తీరంలో బోటు మునక - 5లో

ఓడల రాకపోకల దిక్సూచీ.. వాకలపూడి లైట్ హౌస్

జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా కాకినాడ బీచ్ అభివృద్ధి చెందింది. సముద్ర మార్గం గుండా దేశ, దేశాల నుంచి కాకినాడకు వచ్చే ఓడల రాకపోకల రవాణా దిక్సూచీగా వాకలపూడి లైట్ హౌస్ విశేష సేవలందిస్తోంది. పూర్వం బ్రిటీష్‌వాళ్లు నిర్మించిన లైట్‌హౌస్‌ను ఆధునికీకరించి మరింత ఎత్తులో నిర్మించి సందర్శకులు తిలకించేందుకు అనుమతి ఇస్తున్నారు. దీంతో ఇది ఒక విజ్ఞాన, విహార కేంద్రంగా ఖ్యాతి గడించింది. బ్రిటీష్‌కాలంలో నిర్మించిన లైట్‌హౌస్‌ని సందర్శన కోసం పెద్దఎత్తున పర్యాటకులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో వాకలపూడి లైట్‌హౌస్‌పై ప్రత్యేక కథనం..

- రాత్రిపూట దీపకాంతులతో కాకినాడ బీచ్‌కు మణిహారం
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి చర్యలు
- సందర్శకులకు అనుమతి



వాకలపూడి సముద్రతీరంలో నిర్మించిన లైట్‌హౌస్.. పక్కనే పాత లైట్‌హౌస్

సర్పవరం జంక్షన్, జూలై 13:

బ్రిటీష్‌కాలం నాటిది..

దేశ, విదేశాల నుంచి సముద్రమార్గం గుండా కాకినాడకు వచ్చే ఓడలు, నౌకలు(మాస్టర్ వెస్సల్స్) రాకపోకల సేవలో వాకలపూడి లైట్‌హౌస్ విశేష సేవలు అందిస్తోంది. ముఖ్యంగా 1878 సంవత్సరంలో ఐదెకరాల విస్తీర్ణంలో 110 అడుగుల ఎత్తులో లైట్‌హౌస్‌ను నిర్మించారు. లైట్‌హౌస్ ద్వారా సముద్రంలో రాకపోకలు సాగించే ఓడల లేండ్ గుర్తింపు కోసం ఈ దీపంనుంచి ప్రసరించే సిగ్నల్స్ ఎంతోగానో దోహదపడేవి. 110 మెట్లతో లైట్‌హౌస్‌ని ఏర్పాటు చేయగా, ఓడలకు సిగ్నల్స్ అందడంకోసం రెడ్ అండ్ వైట్ బేండ్స్‌పై లేంప్(దీపం)ను ఏర్పాటు చేశారు. లైట్‌హౌస్ నుంచి 19 నాటికల్ మైళ్ల దూరంలో ఉండే ఓడలకు ఈ సిగ్నల్స్ చేరేలా 150 ఓట్స్ ల్యాంప్ ఏర్పాటు చేశారు. లైట్‌హౌస్ పైభాగం నుంచి వెలువడే సిగ్నల్స్ ఓడలకు చేరేలా ప్రిసమ్ గ్లాస్‌ని బిగించడంతో కాంతి కిరణాలు దాదాపు 19 నాటికల్‌మైళ్ల వరకు వెళ్తున్నాయి. ఈ గ్లాస్ ఇటలీ నుంచి దిగుమతి అయింది. ఇది కిరోసిన్‌పై పనిచేసేది. లైట్‌హౌస్ రాత్రిపూట నిరంతరం పనిచేసేలా మూడు షిఫ్ట్‌ల్లో సిబ్బంది చేతితో మిషన్ తిప్పేవారు. నిమిషానికి నాలుగు రౌండ్ల లైట్ రొటేషన్‌లో కాంతిని ప్రసరించేది. ఒకసారి వచ్చిన ఫ్లాష్ 19 సెకన్ల పాటు ఉండేది. 136ఏళ్లపాటు ఈ పాత లైట్‌హౌస్ ఓడలు, స్థానిక మోటరైజ్డ్, మోకనైజ్డ్ బోట్లకు సేవలందించింది. ప్రస్తుతం ఇది విశ్రాంతి తీసుకుంటోంది.



లైట్‌హౌస్ విద్యుత్ అవసరాలకు వినియోగిస్తున్న సోలార్ ప్యానల్

48 మీటర్ల ఎత్తులో నూతనంగా ఏర్పాటు

బ్రిటిష్ కాలం నాటి లైట్‌హౌస్‌కి ప్రత్యామ్నాయంగా 2004 సంవత్సరంలో రూ.1.30కోట్ల వ్యయంతో 47.88మీటర్ల ఎత్తులో మరో లైట్‌హౌస్‌ను నిర్మించారు. కింద భాగంనుంచి పైవరకు నూతనంగా నిర్మాణం చేపట్టారు. పైభాగంలో ప్రిసమ్ గ్లాస్, సెట్టింగ్ తదితర పరికరాలు ఇండియాలో అందుబాటులో లేకపోవడంతో పాత లైట్‌హౌస్‌కు వినియోగించిన పరికరాలనే ఏర్పాటు చేశారు. ఇది భూమినుంచి 48 మీటర్ల ఎత్తులో ఉండగా పైభాగానికి చేరుకోవడానికి 220 మెట్లు ఉన్నాయి. ఈ లైట్ ఆటోమెటిక్ సిస్టమ్‌లో పనిచేస్తోంది. విద్యుత్, సోలార్, జనరేటర్‌ల సాయంతో ఇది నిరంతరంగా పనిచేస్తోంది. దీనికి విద్యుత్తును సమకూర్చేందుకు 3 కిలోవాట్‌ల సోలార్ సిస్టమ్‌ని సొంతంగా ఏర్పాటు చేశారు.

పర్యాటక కేంద్రంగా లైట్‌హౌస్

బ్రిటీష్ కాలం నాటి లైట్‌హౌస్‌ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలంలో పార్కు, చిన్నారులు ఆడుకునేందుకు క్రీడా పరికరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. గతంలో లైట్‌హౌస్‌లోకి సందర్శకులను అనుమతించేవారు కాదు. సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇప్పుడున్న లైట్‌హౌస్‌ని తిలకించేందుకు అధికారులు అనుమతి ఇస్తున్నారు. దీన్ని సందర్శించేవారు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్యలో లైట్‌హౌస్ లోపలికి వెళ్లి ఆనందంగా గడిపేందుకు అవకాశం కల్పించారు. స్వల్ప ప్రవేశ రుసుంతో సందర్శనకు అనుమతి ఇవ్వడంపట్ల సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా పైకి నిలువుగా మొత్తం 220 మెట్లు ఉండడంతో అనారోగ్య సమస్యలతో బాధపడేవారు అంతపైకి ఎక్కడం కాస్త ఇబ్బంది కలగవచ్చు. ఆరోగ్యపరంగా ఇబ్బంది లేనివారు మాత్రమే ఎక్కాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.



బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో 1878లో నిర్మించిన లైట్‌హౌస్

కాకినాడ జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్



కాకినాడ క్రైం, జూలై 13: కాకినాడ జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్‌ను నియమిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన 2016ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సుబ్రమణి సతీష్‌కుమార్ గుంటూరు జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. 2023, ఏప్రిల్‌లో కాకినాడ జిల్లా ఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. విక్రాంత్ పాటిల్ కర్ణాటక రాష్ట్రానికి చెందినవారు. 2012 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన తొలుత చిత్తూరు జిల్లా ఎస్పీగా పనిచేశారు. అనంతరం విజయవాడ డీసీపీగా విధులు నిర్వర్తించారు. తర్వాత విజయనగరం జిల్లా చింతలవలస 5వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేశారు. అనంతరం పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన కాకినాడ జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. విక్రాంత్ పాటిల్ సతీమణి ఎం.దీపిక 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. ఆమె విజయనగరం జిల్లా ఎస్పీగా పనిచేస్తూ అనకాపల్లి జిల్లాఎస్పీగా బదిలీ అయ్యారు.

మూడోరోజు కొనసాగిన అల్లూరి సీతారామారాజు నాటక కళాపరిషత్ 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటికల పోటీలు - 5లో



కాకినాడ సూర్యకళామందిరంలో జరుగుతున్న నాటిక పోటీల్లో ఓ నాటికలోని సన్నివేశ దృశ్యం

పిఠాపురం పశువుల సంతకు పూర్వవైభవం దిశగా అడుగులు



- అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారుల పరిశీలన
- డిప్యూటీ సీఎం పవన్ ఆదేశంతో కదలిక
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పిఠాపురం పశువుల సంత వద్ద పరిశీలన జరుపుతున్న అధికారులు

పిఠాపురం, జూలై 13: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యేక స్థానం కలిగిన పిఠాపురం పశువుల సంతకు పూర్వ వైభవం కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయి. సంతలో చేయాల్సిన అభివృద్ధి పనులు, కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, సంత జరుగుతున్న తీరు తదితర అంశాలపై శుక్ర, శనివారాల్లో అధికారులు పరిశీలన జరిపారు.

ఒకప్పుడు ఉమ్మడి జిల్లా రైతులు అందరూ తరలివచ్చి పశువుల క్రయ, విక్రయాలతో కళకళలాడిన పిఠాపురం పట్టణం అగ్రహారంవద్ద ఉన్న పశువుల సంత వైభవాన్ని కోల్పోవడం, ఇక్కడకు వచ్చే పశువుల సంఖ్య వందల్లోకి పడిపోవడం, సంతలో ఉన్న షెడ్లు శిథిలావస్థకు చేరడం, వాటికి, రైతులకు కనీసం తాగునీటి సదుపాయం లేకపోవడం తదితర కారణాలతో ఇక్కడకు వచ్చేందుకు అనాసక్తి ప్రదర్శిస్తున్నారన్న సంగతిని వివరిస్తూ ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. ఇదే సమయంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకుగాను పిఠాపురంలో బహిరంగసభ నిర్వహించిన పవన్‌కల్యాణ్ తాను ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరోమారు గుర్తు చేశారు. పిఠాపురం పశువుల సంతను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్‌కు సూచించారు. కలెక్టరు ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు శుక్ర, శనివారాల్లో పశువుల సంతను పరిశీలించారు. ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలను గుర్తించారు. పశువుల సంత చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం, పశువులు వచ్చేందుకు వీలుగా రోడ్డును చేర్చి ప్రధాన ముఖద్వారం, సంత నుంచి పశువులు వెళ్లేందుకు మరో ద్వారం, గేట్లు ఏర్పాటు, పశువులను ఉంచేందుకు వీలుగా నాలుగు షెడ్ల నిర్మాణం, రైతులు విశ్రాంతి, సేదతీరేందుకు ఏర్పాట్లు, పశువులు నీరు తాగేందుకు సంత లోపల, బయట నీటితొట్టెల నిర్మాణం, సీసీ కెమేరాలు ఏర్పాటు, పశువుల రాంప్, పశువైద్యాధికారికి ప్రత్యేక రూమ్, అధికారులు ఉండేందుకు రెండు రూమ్‌లు, పశువులకు పరీక్షలు చేసేందుకు ట్రెవిస్ ఏర్పాటు సహా ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని గుర్తించారు. వీటికి రూ.2కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. శనివారం సంతలో రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. పరిశీలనలో పెద్దాపురం డీఎల్‌డీవో కేవీఎస్ ప్రసాద్, పంచాయతీరాజ్ డీఈఈ వెంకటేశ్వరరావు, పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టరు డాక్టర్ నిర్మలకుమారి, మునిసిపల్ కమిషనరు నామా కనకారావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శిరీష, పశువైద్యాధికారి రంజిత్‌సింగ్ పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న అన్నక్యాంటీన్



అన్నక్యాంటీన్‌లు సిద్ధమవుతున్నాయి. టీడీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని సీఎం చంద్రబాబు మాటిచ్చారు. దాని ప్రకారం ఎక్కడికక్కడ వాటిని సిద్ధం చేస్తున్నారు. ఆ ప్రకారంగా కాకినాడలో గతంలో ఉన్నచోటే మళ్లీ అన్నక్యాంటీన్ పెట్టేందుకు భవనాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యమిది..

-ఫొటోగ్రాఫర్, కాకినాడ

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ ప్రతుల దహనం - 5లో

అతిసారపై అప్రమత్తమైన అధికారులు - 5లో

వృద్ధుడి కోసం గాలింపు ముమ్మరం - 5లో

ఆటలు సాగక.. ఆపసోపాలు



బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రం

- ప్రభుత్వం మారడంతో జిల్లాలో అమూల్ ప్రాజెక్టు ఆట కట్టినట్టే
- కూటమి సర్కారు రావడంతో పశుసంవర్ధకశాఖ నుంచి ఆగిన అడ్డగోలు సహకారం
- జిల్లాలో రోజుకు 24వేల నుంచి 14వేల లీటర్లకు పడిపోయిన పాల సరఫరా
- ఎక్కడికక్కడ మంచి ధర వస్తుండడంతో రైతుల నుంచి అమూల్‌కు పాలు కట్
- బలవంతపు సరఫరా నుంచి ఒక్కొక్కరుగా తప్పుకుంటున్న పాడిరైతులు
- గత వైసీపీ సర్కారు అడ్డగోలు సహకారంతో అమూల్ కోసం అధికారుల తెగింపు
- పథకాలు ఆగిపోతాయంటూ రైతులను బెదిరించి మరీ కంపెనీకి పాలసేకరణ
- జనం డబ్బుతో కంపెనీ కోసం ఏకంగా బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు ఏర్పాటు
- మిల్క్‌చిల్లింగ్ కోసం రేఖవానిపాలెంలో మూతపడ్డ డైరీని లీజుకు ఇప్పించిన వైనం
- ఇప్పుడు కొత్త ప్రభుత్వం రావడంతో దందా సాగక అమూల్ ఆపసోపాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అమూల్ ప్రాజెక్టు ఆట కడుతోంది. కొత్త ప్రభుత్వం రావడంతో అధికారులనుంచి అడ్డగోలు సహకారం అందక ఆపసోపాలు పడుతోంది. పాలసేకరణ అడ్డంగా పడిపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇతర డైరీలను కుప్పకూల్చాలన్న పగతో నాడు జగన్ ప్రభుత్వం అమూల్‌ను నెత్తినెత్తుకుని ఊరేగింది. జిల్లాలో ఈ కంపెనీకి అన్నివిధాలా ప్రత్యేక ఆసక్తితో అండదండలందించింది. పాలసేకరణ నుంచి కంపెనీ పాల విక్రయాలకు కావాల్సిన భవనాలు, యంత్రాల వరకు అన్నింటా తానే అయి వ్యవహరించింది. పాల సేకరణ అసాధ్యంగా మారడంతో అధికారుల ద్వారా పాడి రైతులను బెదిరించింది. అమూల్‌కు పాలుపోయికపోతే పథకాలు కట్ అంటూ భయపెట్టింది. మిగతా డెయిరీలకు పాల సరఫరా ఆపించేసి అధిక ధర అంటూ ఊదరగొట్టి అమూల్ నెత్తిన పాలుపోసింది. వినియోగదారులకు కంపెనీ ఉత్పత్తులను విక్రయించేలా ఏకంగా రహదారుల పక్కన స్థలం ఇచ్చి మరీ ప్రోత్సహించింది. తీరా ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో అమూల్ ఆటలు సాగడం లేదు. నాటి ప్రభుత్వం అడ్డగోలు అండదండలతో ఎదురేలేదని విర్రవీగగా ఇప్పుడు పాలసేకరణ నిలువునా పడిపోతుండడంతో కలవరపడుతోంది.

అమూల్ కోసం అన్నీ అడ్డదార్లే..

పాడి రంగానికి జిల్లా పెట్టింది పేరు. ఏటా 15.32లక్షల మెట్రిక్ టన్నుల పాల దిగుబడి జిల్లాలో జరుగుతోంది. ఇలా దిగుబడయ్యే పాలను ఎక్కడికక్కడ జిల్లాలో సహకార డెయిరీలు, ఇతర ప్రైవేటు డెయిరీలు నేరుగా రైతులనుంచి కొనుగోలు చేస్తున్నాయి. ప్రధానంగా జిల్లాలో విశాఖ, హెరిటేజ్, విజయ తదితర డెయిరీలు ఈ పాలను అత్యధికంగా మంచి ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నాయి. వెన్న శాతం ఆధారంగా ఒక్కో కంపెనీ ఒక్కో ధర చెల్లిస్తుంది. పోటీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల ఆధారంగా రైతులకు ధరలు లభిస్తున్నాయి. సేకరించిన పాలకు ప్రతి పది రోజులకు పాడిరైతుల ఖాతాల్లో కంపెనీలు డబ్బు జమ చేస్తున్నాయి. అయితే వీటిని దెబ్బతీయాలనే కక్షతో గత జగన్ ప్రభుత్వం జిల్లాలో గతేడాది జూలైలో అమూల్ ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. ఈ కంపెనీకి ప్రభుత్వ నిధులతో సర్వం సమకూర్చింది. ఒక్క అమూల్ మాత్రమే ఉండేలా మిగతావాటి ఉనికే లేకుండా చేయడానికి తెగ తాపత్రాయపడింది. అందుకోసం జిల్లాలో ఏమాత్రం బలం, బలగం లేని అమూల్‌కు అన్నీ తానే అయి జగన్ ప్రభుత్వం వ్యవహరించింది. జిల్లా పశుసంవర్ధకశాఖను రంగంలోకి దించి అమూల్‌కు పాలసేకరణ జరిగేలా ఒత్తిడి తెచ్చింది. ఎక్కడికక్కడ గ్రామాల్లో అమూల్ కోసం పాలసేకరణ చేసేందుకుగాను రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసింది. వీటిలోనే పాలసేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఒక్కో ఆర్బీకేలో రోజుకు 160 లీటర్ల వరకు పాల సేకరణ జరిగేలా సంబంధిత ప్రాంతంలో రైతులతో సంప్రదింపులు జరిపింది. అప్పటికే అనేక డెయిరీలకు పాల సరఫరా చేస్తోన్న పాడి రైతులను పశుసంవర్ధకశాఖ అధికారులు బెదిరించారు. అమూల్‌కే పాలు సరఫరా చేయాలంటూ ఒత్తిడి తెచ్చారు. లేదంటే పథకాలు ఆగిపోతాయని భయపెట్టారు. ఈ కంపెనీకి ఎక్కడా పాలసేకరణ చిక్కులు లేకుండా అధికారులే అన్నీ సమకూర్చారు. అందరినీ బెదిరించి, ఇతర కంపెనీలకు పోస్తోన్న పాలను ఆపించేసి అమూల్‌కే పంపేలా చేశారు. దీంతో రోజుకు జిల్లాలో 14 మండలాల నుంచి అమూల్‌కు ఏ కంపెనీకి లేనివిధంగా రోజుకు ఏకంగా 24వేల లీటర్ల పాల సేకరణ జరిగేలా ప్రభుత్వం అడ్డగోలుగా సహకరించింది. మొత్తం 196 సొసైటీల ద్వారా 5వేలమంది పాడి రైతులను అమూల్‌కోసం పాలు ఇచ్చేలా చేసింది. గ్రామాల్లో సేకరించిన పాల నిల్వకు వీలుగా నేమాం, పనస పాడు, గంగనాపల్లి ప్రాంతాల్లో మూడు బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాలు సైతం ఏర్పాటు చేసింది. ఒక్కోదానికి రూ.18లక్షల చొప్పున ప్రజాధనం వెచ్చించింది. ఇదికాక సేకరించిన పాలను కూలింగ్ కేంద్రాలనుంచి చిల్లింగ్‌కు తరలించేందుకు తుని సమీపంలోని రేఖవానిపాలెంలో ఓ పాత డెయిరీని దారికి తెచ్చి లీజుకు తీసుకుని అమూల్‌కు అప్పగించింది. అందులో కావాల్సిన యంత్రాలకు సహకారం ఇచ్చింది. ఇలా ప్రైవేటు కంపెనీ అమూల్‌కు అన్నిరకాల ప్రయోజనాలు కల్పించింది. ఇదికాక అమూల్ పాల ఉపఉత్పత్తుల విక్రయాలకోసం అనేకచోట్ల ప్రధాన రహదారులను ఆనుకుని అవుట్‌లెట్లను ఏర్పాటు చేయించింది. కంపెనీకి ఏదికావాలో అది గత జగన్ సర్కారు పూర్తిగా అధికార దుర్వినియోగం చేసి సమకూర్చింది.

అడ్డగోలు సహకారం లేక..

జగన్ సర్కారు పాపం పండి కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో ప్రస్తుతం అమూల్ కంపెనీ ఆపసోపాలు పడుతోంది. ఇన్నాళ్లు ప్రయాసనేదే తెలియకుండా గత జగన్ ప్రభుత్వ సహకారం, జిల్లా పశుసంవర్ధకశాఖ తోడ్పాటుతో పాలసేకరణ నుంచి కూలింగ్, చిల్లింగ్ కేంద్రాల వరకు ఆడుతూపాడుతూ అన్నీ సమకూర్చుకుంది. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారడంతో జిల్లా అధికారులనుంచి అడ్డగోలు సహకారం ఆగిపోయింది. ఏది కావాలంటే అది ఇష్టానుసారం చేసిపెట్టే పరిస్థితి మాయమవడంతో తలపట్టుకుంటోంది. అటు గడచిన కొన్ని రోజులు కూటమి ప్రభుత్వం వచ్చిందన్న ధైర్యంతో భయపడి పాలుపోస్తోన్న పాడిరైతులు క్రమేపీ తప్పుకుంటున్నారు. అమూల్‌కు పాలు పోయలేమని మానేస్తున్నారు. దీంతో గత మే వరకు జగన్ సర్కారు అండతో రోజుకు 24వేల లీటర్ల వరకు జరిగిన పాలసేకరణ, ఇప్పుడు పరిస్థితులు తారుమారవడంతో ఏకంగా 14వేల లీటర్లకు పడిపోయింది. గ్రామాల్లో రోజురోజుకు పాలు అందించే సొసైటీలు జారకుంటున్నాయి. అదే సమయంలో గత అరాచక ప్రభుత్వ పీడపోవడంతో ప్రైవేటు డెయిరీలు రైతులకు మంచి ధర అందిస్తూ పాలను సేకరిస్తున్నాయి. దీంతో పాడి రైతులు అటువైపు పరుగులు తీస్తున్నారు. అదే సమయంలో గత ప్రభుత్వం అండ చూసుకుని సొసైటీల్లో కొందరు కార్యదర్శులు రెచ్చిపోయారు. చెప్పినట్లు అమూల్‌కు పాలసరఫరా పెంచాలంటూ దౌర్జన్యాలకు దిగారు. ఇప్పుడు వీరందరిని పక్కకు తప్పుకుని పోవాలంటూ తిరగబడుతున్నారు. ఫలితంగా అడ్డగోలు సహకారం ఆగిపోవడంతో జిల్లాలో అమూల్ ఆపోసాపాలు పడుతోంది.

రంప ఏరియా ఆసుపత్రికి సుస్తీ


రంపచోడవరం ఏరియా ఆసుపత్రి

- వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి ఓ రోగి మరణం, సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు
- ఆసుపత్రి వ్యవహారాల్లో ప్రైవేటు వ్యక్తుల చొరబాట్లు
- మొత్తం వ్యవహారాలపై ఆరా తీసిన ఐటీడీఏ పీవో

(రంపచోడవరం):

వైద్యసేవల్లో నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి మృతి, సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు, అసుపత్రి వ్యవహారాల్లో ప్రైవేటు వ్యక్తులు చొరబడటంతో వైద్యుల మధ్య వర్గపోరు వ్యవహారాలతో రంపచోడవరం ఏరియా ఆసుపత్రి మునుపెన్నడూలేని వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. 100 పడకలతో మన్యం 11 మండలాలకు రిఫరల్ వైద్య కేంద్రంగా ఈ వైద్య విధాన పరిషత్ ఏరియా ఆసుపత్రి కొనసాగుతోంది. వివరాల్లోకి వెళితే....

ఇటీవల ఓ వ్యక్తి ఇక్కడ వైద్యుల నిర్లక్ష్యానికి మృతి చెందాడన్న ఆరోపణలతో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్‌గనోరే విచారణ జరిపించారు. ఇందులో ఓ వైద్యుడి నిర్లక్ష్యం తేటతెల్లం కావడంతో తగుచర్యల కోసం ప్రాజెక్టు అధికారి వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్‌కు సిఫార్సు చేశారు. ఇదిలావుండగా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో నిర్వహించే సదరం ఆరోగ్య కేంద్రం చుట్టూ అక్రమాల ఆరోపణలు చుట్టుముట్టాయి. ఇక్కడ సదరం వైద్యుడి పేరుతో ఆసుపత్రికి అనుబంధంగా పనిచేసే ఉద్యోగులు కొందరు, ప్రైవేటు వ్యక్తులు కొందరు సిండికేటుగా మారి అంగవైకల్యాన్ని ఆశించిన వారికి అనుకూలంగా ధ్రువీకరించేందుకు డబ్బులు వసూలు చేయడం ప్రహసంగా సాగింది. ఈ వ్యవహారంలో కొందరు తమ సదరం సర్టిఫికెట్ల కోసం డబ్బులను మధ్యవర్తులకు చెల్లించుకుని నేటికీ సర్టిఫికెట్లు రాక మోసపోయారు. ఇంతేకాకుండా ఆసుపత్రి పాలనా వ్యవహారాలకు సంబంధంలేని ప్రైవేటు వ్యక్తులు చొరబడి వైద్యులను కూడా శాసించే పరిస్థితికి వచ్చారు. కొందరైతే ఎమ్మెల్యేగారి తాలూకా అంటూ చెలామణి అయ్యేందుకు ప్రయత్నించి ఆసుపత్రిపై పట్టు సాధించాలని చూస్తున్నారు. అటువంటి వారిని పసిగట్టిన ఎమ్మెల్యేగారి శిబిరం సదరు వ్యక్తులను దూరం పెట్టినట్టు తెలిసింది. ఇదే తరుణంలో ఆసుపత్రిలోని వైద్యులు గ్రూపులుగా విడిపోయి, వర్గపోరును కొనసాగిస్తున్నారు. ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించడం కూడా వైద్యులు మానేశారు. కొన్ని సందర్భాలలో స్టాఫ్ నర్సులే రోగులను ఆదుకునే పరిస్థితి నెలకొంది. డ్యూటీలో ఉండాల్సిన డ్యూటీ వైద్యులు అత్యవసర కేసులు వచ్చాయని నర్సులు పిలిస్తేగానీ రాలేని పరిస్థితులు నెలకొన్నాయి.

సరైన వైద్య సేవలు అందడంలేదు

ఇదిలావుండగా సాధారణ రోగులు సైతం వైద్యుల మధ్య వర్గపోరు కారణంగా సరైన వైద్య సేవలు పొందలేకపోతున్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించడం లేదా గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రదీప్ అనే వైద్యుడు అందించే సేవలు కోసం అక్కడకు వెళ్లిపోతున్నారు.

ఫిర్యాదులతో కాలయాపన

దీంతో ఒకరిపై ఒకరు నిఘాను కొనసాగిస్తూ లోపాలను వెతుకుతూ ఎవరిదారిలో వారు తమకు ఉన్న పరిచయాలతో ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఒకరుపై ఒకరు చేసుకుంటు న్న ఫిర్యాదులు ఇటు అధికార వర్గాల నుంచీ, అటు ప్రజాప్రతినిధుల నుంచి సంబంధిత వైద్య విధాన పరిషత్ అధికారులకు చేరుతున్నాయి. వ్యవహారంపై రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టి సారించడంతో ఇప్పటికే బాధ్యులపై తగు చర్యలకు రంగం సిద్ధమవుతోంది.



కొండలపై తెల్లటి మేఘాలు

అల్లూరిజిల్లా దేవీపట్నం మండలంలోని ఇందుకూరు-1 ఏనుగులగూడెం ఆర్ అండ్ఆర్ కాలనీ సమీపంలో గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో కొండలపై తెల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. ఈ ప్రకృతి సోయగం చూస్తే ఊటీని తలపిస్తున్నట్లు ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

- దేవీపట్నం

భక్తవత్సల గోవింద గోవిందా...

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.43.25 లక్షలు


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి


స్వామివారిని దర్శించుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

ఆత్రేయపురం, జూలై 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. తూర్పుగోదావరిజిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. వివిధసేవలద్వారా స్వామివారి ఒక్క రోజు ఆదాయం రూ.43.25లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు.

శృంగారవల్లభ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు


శృంగారవల్లభస్వామి

పెద్దాపురం, జూలై 13: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారు జామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,56,900 అన్నదాన విరాళాలు రూ.52,361 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.6,600 తులాభారం రూ.250, లడ్డూ ప్రసాదం ద్వారా 30,060, వెరసి రూ.3,46,171 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి నారా యణాచార్యులు పాల్గొన్నారు.

పోలవరం లోపాలపై హైకోర్టులో పిల్

- అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13: పోలవరం ప్రాజెక్టు లోపభూయిష్టంకాదని ప్రభుత్వం చెబితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ సవాల్ చేశారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థ కాన్ఫరెన్స్ హాలులో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్లు మారిపోతున్నారన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో చాలా లోపాలు ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు ఎంత ఖర్చు పెట్టారు.. ఇంకా ఎంత ఖర్చవుతుందనే విషయాలు ప్రస్తావించలేదన్నారు. లోపాలపై అన్ని వివరాలతో హైకోర్టులో పిల్ వేస్తున్నానని చెప్పారు. సమావేశంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపకుడు కృష్ణమూర్తినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి సేవకు

వాయిద్య పరికరాల అందజేత

అన్నవరం, జూలై 13: సత్యదేవుడి సన్నిధిలో నిర్వహించే వివిధ ఆర్జితసేవలలో వాయించే మంగళధ్వనులకు అవసరమయ్యే డోలు, సన్నాయిలను విజయవాడకు చెందిన శనగశెట్టి జగదీష్ దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.95వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈసందర్భంగా దాతను ఆయన అభినందించారు.

అందుబాటులోకి పుట్టగొడులు


దేవీపట్నంలో లభించిన పుట్టగొడుగులు

దేవీపట్నం, జూలై 13: ప్రతీఏటా జూలై, ఆగస్టు నెలలో అటవీ ప్రాంతాల్లో గిరిజనులకు లభ్యమయ్యే పుట్టగొడులు ఈఏడాది అందుబాటులోకి వచ్చాయి. కేవలం ఈరెండు నెలల్లో మాత్రమే అతి తక్కువగా లభ్యమవుతుంటాయి. మాంసకృతులు, ప్రొటీన్లు పుష్కలంగా ఉండడంతో వీటికి ఎంతో డిమాండ్ ఉంది.

అంతర్వేది తీరంలో బోటు మునక

- సురక్షితంగా బయటపడ్డ 9మంది మత్స్యకారులు



అంతర్వేది బీచ్‌లో బోటు మునిగినపోతున్న బోటు, అనంతరం ఒడ్డుకు చేరి మత్స్యకారులు

అంతర్వేది, జూలై 13: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సాగర సంగమం సముద్రంలో ఇసుక మేటలు తగిలి కాకినాడ జిల్లాకు చెందిన సోనా బోటు శనివారం ఉదయం సముద్రంలో మునిగిపోయింది. బోటులో ఉన్న తొమ్మిది మంది మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. కాకినాడ నుంచి నాలుగు బోట్లలో మత్స్యకారులు శనివారం ఉదయం వేటాడుతూ అంతర్వేది వైపు వస్తున్నారు. అంతర్వేది సాగరసంగమం సముద్రంలో ఇసుక మేటలు తగలడంతో ఒక బోటు సముద్రంలో నిలిచిపోయింది. ఇసుక మేటలు తగలడంవల్ల బోటుకున్న చెక్క విరిగింది. దీంతో బోటు లోపలికి నీరు ప్రవేశించింది. దీంతో బోటు మెల్లగా సముద్రంలో మునిగిపోయింది. వేటాడుతూ వస్తున్న వేరే బోటు సహాయంతో తొమ్మిది మంది మత్స్యకారులు ఒడ్డుకు చేరుకున్నారు.మునిగి పోతున్న బోటు వద్దకు వెళ్లి వలలు, వేటాడిన చేపలను తీసుకు రావడానికి స్థానిక పల్లిపాలెంలో ఉన్న చిన్నబోటు సహాయంతో స్థానిక మత్స్యకారులు, సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులు వెళ్లే ప్రయత్నం చేశారు. అలలు ఉధృతంగా ఉండడంతో వారు వెనుతిరిగారు. మునిగిపోయిన బోటులో వలలు, వేటాడిన చేపలు ఉన్నాయి. రూ.20లక్షల నష్టం ఏర్పడిందని బోటు నిర్వాహకుడు వీరబాబు తెలిపాడు. కాకినాడకు చెందిన కొప్పాలి ధన బోటు యజమానిగా స్థానిక మత్స్యకారులు గుర్తించారు. కామాడి తాతారావు, కామాడి గోవిందు, బొడ్డు తాతారావు, బొడ్డు కృష్ణమూర్తి, కర్రి సత్యనారాయణ, కర్రి అప్పారావు, మరో ముగ్గురు మత్స్యకారులు బోటు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

కళారంగం అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులవ్వాలి

- సీ పోర్ట్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్


సూర్యకళామందిర్‌లో ఎస్‌వీఎస్‌వీవీఎన్ మూర్తికి ఆంధ్రశ్రీ అవార్డు అందజేస్తున్న దృశ్యం

పోర్టు సిటీ (కాకినాడ), జులై 13: కళారంగం అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులవ్వాలని కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మెర్ల మురళీధర్ అన్నారు. అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటికల పోటీలు పురస్కరించుకుని మూడోరోజు శనివారంరాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పైవిధంగా వ్యాఖ్యానించారు. ఆత్మీయఅతిథిగా పాల్గొన్న ప్రణవ ఆశ్రమం మాతాజీ సుమిత్రానంద సరస్వతి మాట్లాడుతూ భారతీయ కళలవైపు ప్రపంచ దేశాలు చూస్తుండటం, మన దేశానికే గర్వకారణమని చెప్పారు. అనంతరం సలాది వీర వెంకటసత్యనారాయణమూర్తికి ఆంధ్ర ఆవార్డు బహూకరించారు. ఈ కార్యక్రమానికి తొలుత నిర్వహించిన ఏకపాత్రాభినయ పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అందరినీ ఆలోచింప చేసిన మూల్యం నాటిక..

గోవాడ క్రియేషన్స్ హైదరబాద్ ఆధ్వర్యంలో సింహప్రసాద్ రచన, డాక్టర గోవాడ వెంకట్ దర్శకత్వంలో ప్రదర్శించిన మూల్యం నాటిక అందరినీ ఆలోచింప చేసింది. నేటి సమాజంలో ఆడపిల్లలపై పెడుతున్న ఆంక్షలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ప్రదర్శన కొనసాగింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా ఒక వివాహిత మహిళ ఏ విధంగా హక్కులను సాధించింది నాటిక రూపంలో ప్రదర్శించారు. అదేవిధంగా కరీంనగర్ చైతన్య భారతి సంస్థ ఆధ్వర్యంలో స్వప్నం రాల్చిన అమృతం నాటికను ప్రదర్శించారు. నాటికకు మూలకథ పీఎస్ నారాయణ అందించగా, మంచాల రమేష్ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కర్రి అచ్చుతరామారెడ్డి, పంపన దయానందబాబు, జాతీయ అల్లూరి యువజన సేవఆ సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, గౌరవ సలహాదారులు గట్టి సత్యనారాయణ, రాయప్రోలు భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు జలకళ

- పొంగుతున్న వాగులు, వంకలు
- స్తంభించిన జనజీవనం
- భారీ వర్షాలతో పోటెత్తుతున్న వరదనీరు


ఎటపాక: జలకళను సంతరించుకున్న అలుగు ప్రాజెక్టు



ఇందుకూరుపేట వద్ద పొంగిన ఇనుకొండ వాగు, చెరువు నీరు బయటకు పోతున్న దృశ్యం

దేవీపట్నం, జూలై 13: అల్పపీడనం ప్రభావంతో శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలకు అల్లూరిజిల్లా దేవీపట్నం మండలంలో ఇను కొండ, సీతపల్లి, ఫజుల్లాబాద్ తదితర వాగులు పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామాల్లో జనజీవనం స్తంభించింది. ఎక్కడి ప్రజలు అక్కడే ఉండిపోవడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. చాలావరకు ప్రజ లు తమ ప్రయాణాలు రద్దు చేసుకుంటున్నారు. ఇందుకూరు గ్రామ శివారున రైతు ముచ్చు నాగేశ్వరరావు చెరువులోకి అధిక మొత్తంలో వర్షపునీరు చేరడంతో చెరువులోని చేపలు తరలిపోయాయి. దీంతో లక్షల్లో నష్టం వాటిల్లినట్లు బాధితుడు చెబుతున్నాడు.

నిండిన అలుగువాగు ప్రాజెక్టు

ఎటపాక, జూలై 13: అల్లూరి జిల్లా ఎటపాక మండ లం అచ్చుతాపురం గ్రామంవద్ద ఉన్న అలుగువాగు ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. గత ఐదారు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతోపాటు ప్రాజె క్టు ఎగువన భారీ వర్షాలు పడడంతో వరద నీరంతా ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. దాంతో ప్రాజెక్టు నిండి వరదనీరంతా పొంగిపొర్లుతోంది. వరద ప్రవాహం ప్రాజెక్టు దిగువకు ప్రవహిస్తోంది. వరద నీరంతా ప్రవహిస్తూ ఉండడంతో స్థానిక గిరజనులు జోరుగా చేపలను వేటాడుతున్నారు.

పురుగులమందు కలిసిన నీళ్లు తాగిన

12 మంది కూలీలకు అస్వస్థత

- వడ్డిపాలెం చెరువుల వద్ద ఘటన
- క్షతగాత్రులు పశ్చిమ బెంగాల్ వాసులు


కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న పశ్చిమ బెంగాల్ కూలీలు

కరప, జూలై 13: ప్రమాదవశాత్తూ పురుగులమందు కలిసిన నీటిని తాగి 12మంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారిగా గుర్తించారు. స్థానికంగా సంచలనమైన ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా కరప పోలీసులు విఫలయత్నంచేయడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం యండమూరు శివారు వడ్డిపాలెంలో కిరణ్‌రాజు అనే వ్యక్తి ఆక్వా చెరువులను సాగుచేస్తున్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన 12మంది కూలీలు 15రోజుల క్రితం ఇక్కడకు వచ్చి చెరువులవద్ద పనులు చక్కబెడుతున్నారు. శనివారం ఉదయం కూలీలు తమ పని ముగించుకుని వాటర్ టిన్నులోని నీరు తాగి ఒక్కసారిగా వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన షేక్ సలీం, అజీద్, నూరుద్దీన్, అమనుల్లా, ఫరూఖ్, కలిపటిముండ్, ప్రొడాస్, సొంతూల్, ఫైజల్, అన్వర్, సలుద్దీన్, అమీనుద్దీన్‌లు విషతుల్యమైన నీటిని తాగినట్టుగా గుర్తించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. పురుగులమందు కలిసిన నీటిని తాగడంవల్లనే ఇలా జరిగిందని ప్రాథమికంగా గుర్తించారు. చెరువుల యజమాని ఫిర్యాదు మేరకు కరప పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ ఘటనకు కారణాలను పోలీసులు అన్వేసిస్తున్నారు. కొన్నిరోజుల క్రితం పిచికారీ చేసిన గడ్డిమందు ప్రభావంవల్ల వాటర్ టిన్నుల్లో తాగునీరు విషపూరితమైనట్టుగా భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎంకే సౌజన్య కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి వా రి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

గొల్లప్రోలులో విజిలెన్స్ తనిఖీలు

- రూ.20.42లక్షలు విలువైన రేషన్ బియ్యం స్వాధీనం
- క్రిమినల్ కేసులు నమోదు


గొల్లప్రోలులో విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన రేషన్‌బియ్యం లారీ

గొల్లప్రోలు, జూలై 13: కాకినాడజిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులో విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. రేషన్‌బియ్యం లారీలో తరలిపోతున్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ రెవెన్యూ పౌరసరఫరాల శాఖల అధికారులు సంయుక్తంగా పట్టణ శివారులో తనిఖీలు చేపట్టారు. లారీని తనిఖీ చేయగా 458 బస్తాల్లో ఉన్న 229 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. రూ. 20.42లక్షలు విలువైన ఈ రేషన్‌బియ్యాన్ని, లారీని సీజ్ చేశారు. దుర్గాడ గ్రామానికి చెందిన ఉమ్మిడి కృష్ణకిరణ్, గొల్లపల్లి శ్రీనివాసరావులు ఈ రేషన్‌బియ్యాన్ని చత్తీస్‌ఘడ్ తరలిస్తున్నట్లు విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. పౌరసరఫరాలశాఖ ద్వారా 6ఏ కేసు నమోదుచేసి బియ్యం, లారీ నిల్వలు స్వాధీనం చేయడంతోపాటు రవాణా చేస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలో ఎవరైనా రేషన్ బియ్యం కొనడం, అమ్మడం చేసినా, నిల్వలు ఉంచినా, రవాణాకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి, ఏవో బార్గవమహేష్, పీసీలు వలీ, వీరబాబు, సీఎస్‌డీటీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం ఓఎస్‌డీ బదిలీ


ఓఎస్‌డీ కేవీ మహేశ్వరరెడ్డి

చింతూరు, జూలై 13: రంపచోడవరం ఓఎస్‌డీ కేవీ మహేశ్వరరెడ్డి బదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ క్రమంలో బదిలీతోపాటు పదోన్నతిని పొందిన మహేశ్వరరెడ్డి శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా బాధ్యత లు చేపట్టనున్నారు. 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మహేశ్వరరెడ్డి మొదటి పోస్టింగ్‌లో భాగంగా 2022 ఆగస్టు22న చింతూరు ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి 2023 ఏప్రిల్ 30 వరకు ఆయన ఏఎస్పీగా ఉన్నారు. అనంతరం ఆయనకు రంపచోడవరం ఓఎస్‌డీగా బాధ్యతలు అప్పగించారు.

సరిగ్గా చదవలేదని కొట్టారు!

- మంచానికే పరిమితమైన విద్యార్థిని
- గురుకుల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

పిఠాపురం, జూలై 13: సరిగ్గా చదవలేదని కొట్టడంతో గురుకుల పాఠశాల విద్యార్థిని మంచానికే పరిమితమైన సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు బాధుల్యపై గురుకుల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన నురుకుర్తి అమృత పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నది. పాఠ్యాంశాలు చదవడం లేదంటూ అమృతను ఉపాధ్యాయులు కర్రతో విచక్షణా రహితంగా కొట్టారని, 24గంటలు పాటు గదిలో నిర్బంధించారని విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు. నడుము, వెన్నుముఖ, తల, శరీరంపై బలమైన గాయాలు కావడంతో అమృత స్పృహ కోల్పోయిందని, కొందరు ఉపాధ్యాయులు ఆసుపత్రిలో చేర్పి చేతులు దులుపుకున్నారు. డిసెంబరు నెలలో ఈ సంఘటన జరగ్గా అప్పటి నుంచి తాము ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా తమ కుమార్తె అమృత కోలుకోలేదని తల్లిదండ్రులు తెలిపారు. చికిత్స చేయించేందుకు తమ వద్ద ఉన్న సొమ్ముతో కాలనీ వాసులు ఇచ్చిన డబ్బుతో చికిత్స చేయించామని చెప్పారు. తమ కుమార్తె మంచానికే పరిమితమైందని వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. తాము ప్రిన్సిపాల్, పీఈటీలను ప్రశ్నించి ఫిర్యాదు చేయడానికి గురుకుల పాఠశాలకు వస్తే లోపలకు కూడా అనుమతించడంలేదని తెలిపారు. అక్కడ బంధువులతో కలిసి ఆందోళన నిర్వహించారు. తాము మానసిక క్షోభను అనుభవిస్తున్నామని, బాధ్యులైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. తాము ఏ విద్యార్థినిని కొట్టలేదని, ఏప్రిల్ వరకూ పాఠశాలకు వచ్చిందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ త్రివేణి తెలిపారు. వేసవి సెలవులు తర్వాత సదరు విద్యార్థిని రాకపోవడంతో తాము అడిగామని, అందుకే ఈ విధంగా చెబుతున్నారని చెప్పారు.

కాకినాడ



అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో వర్షం

ప్రత్తిపాడులో వర్షం

ప్రత్తిపాడు, జూలై 13: ప్రత్తిపాడులో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. విరామం లేకుండా చిరుజల్లులతో కూడిన ఈ వర్షం వల్ల పౌరజీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. 4 రోజులుగా కురుస్తున్న వర్షాలు మండలంలోని ఖరీఫ్ వ్యవసాయ పనులకు ప్రయోజనకరంగా మారాయి.

వరుస దొంగతనాలపై ఎమ్మెల్యే అసహనం

కాకినాడ సిటీ, జూలై 14: అనపర్తి నియోజకవర్గంలోని పెదపూడి మండలంలో వరుస దొంగతనాలు జరుగుతుండడంపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని రామాలయంలో దేవుడి ఆభరణాలు, రామేశ్వరంలో ఒక ఇంట్లో దొంగతనం జరగడంతో వరుస చోరీలపై కాకినాడ జిల్లా ఎస్పీతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో నేర విచారణ ఎంత వరకు వచ్చిందని ఎస్పీతో మాట్లాడి తెలుసుకున్నారు. కాకినాడ జిల్లా కేంద్రంలో గంజాయి వినియోగం పెరిగిన నేపథ్యంలో దానిపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎస్పీ వివరించారు. తనిఖీలు జిల్లా కేంద్రంలో పెరిగిన నేపథ్యంలో కొంతమంది దొంగలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు పెదపూడి, రామేశ్వరం ప్రాంతాల్లో పాగా వేశారని, ఈ నేపథ్యంలో ఇక్కడ నిఘా పెద్దగా లేనందువల్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఎస్పీ దృష్టికి ఎమ్మెల్యే తీసుకువచ్చారు. తక్షణం వరుస చోరీలకు సంబంధించి రికవరీతోపాటు దొంగలను పట్టుకునేలా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలనే విషయంపై ఎస్పీతో రామకృష్ణారెడ్డి చర్చించారు.

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ ప్రతుల దహనం

కాకినాడ సిటీ, జూలై 13: గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేస్తూ అమలు చేయడానికి ప్రయత్నించిన జీపీఎస్ విధానానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పోరాటానికి పిలుపు నిచ్చింది. రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు శనివారం జీపీఎస్ విధానానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను కాకినాడ జిల్లా యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఇంద్రపాలెం బ్రిడ్జి కూడ లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కేవీవీ.నరేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధం చేసిన జీపీఎస్ విధానానికి సంబంధించి గెజిట్‌ను విడుదల చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జీ.ప్రభాకరవర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా, జీపీఎస్ విధానంపై ఏ విధమైన సమీక్ష చేయకుండానే గెజిట్ విడుదల చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంవీ సాయిరామ్, సహాధ్యక్షుడు వీవీ రమణ, జిల్లా మహిళా సహాధ్యక్షురాలు బి.నాగమణి, జిల్లా కార్యదర్శులు టి.సీతారామయ్య, కె.పెద్దిరాజు, ఆడిట్ కమిటీ సభ్యుడు పి.రాజబాబు, సామర్లకోట మండల అధ్యక్షురాలు ఎంబీఎన్ దేవి, శీలం శ్రీనివాస్, వి.ఉమామహేశ్వరరావు, ఈశ్వరరావు, వి.ప్రసాద్ పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తమైన అధికారులు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 13: కాకినాడ దుమ్ములపేట, పర్లోపేట ప్రాంతాల్లో ముగ్గురు అతిసార బారినపడడంతో నగరపాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తమైంది. కమిషనర్ జె.వెంకటరావు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్ శనివారం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అతిసార బాధితుల నివాసితప్రాంతాల్లో నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాలను పరిశుభ్రం చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది నీటి నమూనాలను పరిశీలించి నీటిలోపం లేదని నిర్ధారణకు వచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ అతిసారపై ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.

వృద్ధుడి కోసం గాలింపు ముమ్మరం

గొల్లప్రోలు రూరల్, జూలై 13: ఆర్‌ఆర్‌బీ చెరువులో గల్లంతైన వృద్ధుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని ఏకే మల్లవరం గ్రామానికి చెందిన వృద్ధుడు తటవర్తి వేమన్నదొర పశువులు మేపేందుకు ఈనెల 7వ తేది సాయంత్రం మల్లవరంలోని ఆర్‌ఆర్‌బీ చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చెరువులో పడి గల్లంతై ఉండవచ్చని పోలీసులకు ఫిర్యాదు అందింది. 5రోజులుగా అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు, 2రోజులుగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టినా ఫలితం లేకపోవడంతో శనివారం జేసీబీలతో గుర్రపుడెక్కను తొలగించారు. పడవలతో ఆర్‌ఆర్‌బీ చెరువులోకి దిగి గాలింపు చేపట్టారు. ఆదివారం గాలింపు కొనసాగనుంది. కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు గాలింపు చర్యలను కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు తహశీల్దార్‌ఉదయభాస్కర్ పర్యవేక్షించారు.

'అభివృద్ధిలో భాగస్వాములవుతాం'

పిఠాపురం, జూలై 13: సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములవుతామని నియోజకవర్గ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రకటించారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో శనివారం రాత్రి సంఘం తొలి సమావేశం జరిగింది. ఎక్కడా పనిచేస్తున్న నియోజకవర్గంలో నివాసంఉంటున్న వారందరికి ఇందులో సభ్యత్వం ఉంటుందని, ఉద్యోగులందరిని ఏకతాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజరు రమణారెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి ఏవీవీ సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ విశ్రాంత జేడీ, డీడీలు వెన్నపు చక్రధరరావు, అప్పారావు, వైద్యాధికారి డాక్టర్ విజయశేఖర్, సంఘ వ్యవస్థాపకుడు చామంతి నాగేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందు సుబ్బారావు, రమేష్, కోశాధికారి ప్రసాద్, విజయరవీంద్ర, గంటా వీరప్రసాద్, ఓలేటి పార్థసారధి ఉన్నారు.

'అన్నదాతల అభ్యున్నతికి కృషి చేయాలి'

సర్పవరం జంక్షన్, జూలై 13: వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వంలో అన్నదాతల అభ్యున్నతికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి దంపతులు కోరారు. శనివారం శ్రీకాకుళంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలబొకే అందించి ఘనంగా సత్కరించారు. రైతులకు ధాన్యం బిల్లుల చెల్లింపులు, పంట కాలువల ఆధునీకరణ, నాణ్యమైన విత్తనాలు, పూర్తిస్థాయిలో ఎరువుల పంపిణీ పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. రైతు సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా చంద్రబాబు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

'అసైన్డ్ భూములను పేదలకు పంచాలి'

తాళ్లరేవు, జూలై 13: మండలంలో అసైన్డ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని సీపీఎమ్ పార్టీ నేతలు శనివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు శనివారం వినతి పత్రంను అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నేత టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ పటవల, శాంతమూల, జి.వేమవరంలో 1970లో పేదలకు ప్రభుత్వం ఇచ్చి న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. పోలేకుర్రు, తూర్పుపేట, కోరంగి కంపెనీ భూములు, కోరంగి సెల్వరాజ్ అసైన్డ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరారు. విచారణ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు దుప్పి అదృష్టదీపుడు, నేరేడుమిల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

నాటిక పోటీల్లో ధర్మవరం కళాకారుడికి బహుమతి

ప్రత్తిపాడు, జూలై 13: మండలంలో ధర్మవరం గ్రామానికి చెందిన శ్రీ వీరవెంకట విజయదుర్గ నాట్యమండలి అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు కళా ప్రదర్శనకు తెలుగు రాష్ట్రాలస్థాయిలో మూడో బహుమతి లభించింది. శనివారం సానాకు ఈ పురస్కారాన్ని అందించారు. కాకినాడలోని అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ నందు గత 3రోజులుగా ఆహ్వాన నాటిక, ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నూకరాజు నాయుడు ప్రదర్శించిన బ్రహ్మర్షి విశ్వామిత్ర ఏకపాత్రాభినయానికి మూడో బహుమతి లభించింది. ధర్మవరం సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, మాజీ సొసైటీ అధ్యక్షుడు దాట్ల అప్పన్నబాబు, మండల మాజీ ఉపాధ్యక్షుడు బొల్లు కొండబాబు, గ్రామపెద్దలు సిద్ధ పెద్దకాపు, అద్దేపల్లి రాజా అభినందించారు.

టీడీపీ నేతల ఆందోళన విరమణ

గొల్లప్రోలు రూరల్, జూలై 13: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయం వద్ద టీడీపీ నాయకులు 4రోజులుగా నిర్వహిస్తున్న ఆందోళనను శనివారం విరమించారు. అపర్ణాదేవి ఆలయ నిర్వహణను ఏకపక్షంగా జనసేన నేతలకు అప్పగించడం, టీడీపీ వారికి భాగస్వామ్యం కల్పించకపోవడంపై అపర్ణా ఆలయం వద్ద శిబిరం ఏర్పాటు చేసి ఆందోళన నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో టీడీపీ, జనసేన నేతలు ఈ విషయాన్ని చర్చించి 2 పార్టీలకు కమిటీల్లో ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకుంటారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సోదరుడు రవివర్మ, టీడీపీ మండలాధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, గొల్లప్రోలు మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్‌లు ఆందోళనకారులకు హామీ ఇచ్చి నిమ్మరసమిచ్చి విరమింపచేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు విశ్వనాధుల సుబ్బురామకృష్ణ, చిట్టూరి సుబ్బారావు, గోకరకొండ నారాయణస్వామి, బండారు రామారావు,గారపాటి సుబ్రహ్మణ్యం ఉన్నారు.

న్యాయం కోసం ఆర్టీసీ డ్రైవర్ దీక్ష

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 13: కాకినాడ ఆర్టీసి డిపోకి వెళ్లే దారిలో బ్రిడ్జి కింద ఆర్టీసీ డ్రైవర్ వెంకటేశ్వర్లు 4 వారాలుగా దీక్ష చేస్తూ తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. వెంకటేశ్వర్లు ఒకరోజు కాకినాడ నుంచి విజయవాడ సర్వీస్‌కి వెళ్లాడు. ఇంతలో భారీ వర్షం రావడంతో బస్సులో ప్రయాణికుడు మొబైల్‌లో షూట్ చేసి డ్రైవర్‌ను వివరాలు అడిగి బయట వ్యక్తుల నుంచి వివరాలు సేకరించి మీడియాకు విడుదల చేశారు. తర్వాత జరిగిన పరిణామాల కారణంగా డ్రైవర్‌ను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తన తప్పులేకుండా తనకి శిక్ష వేయడం కరెక్ట్‌కాదని బస్సు రిపేర్‌లో నిర్లక్ష్యంగా ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్ డిమాండ్ చేస్తున్నాడు. ఇదే అంశాన్ని కార్మిక శాఖమంత్రి, కలెక్టర్, సిటీ, రూరల్ ఎమ్మెలే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా వారంతా ఆర్టీసీ అధికారులతో మాట్లాడిన పట్టించుకోకుండా ఎంక్వైరీ పేరుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యూనియన్ నాయకులు పేర్కొన్నారు.

ట్రాఫిక్ తిప్పలు తప్పవా?

» ప్రత్తిపాడు, జగ్గంపేటలో రాకపోకలకు అంతరాయం

» ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు

ప్రత్తిపాడు, జూలై 13: నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు ట్రాఫిక్ పద్మవ్యూహంలో కొట్టుమిట్టాడుతుంది. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో గ్రామంలోని పలు కూడలి ప్రదేశాలు ట్రాఫిక్‌లో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. అల్లూరి సీతారామరాజుసెంటర్, బస్టాండ్ సెంటర్, మార్కెట్, ధర్మవరం వైపు వెళ్లే రహదారుల్లో నిత్యం రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఇరుకుమయంగా ఏర్పడిన రహదారుల వద్ద ఎదురెదురుగా వచ్చే బస్సులు, లారీలు తప్పించుకుని వెళ్లలేని పరిస్థితి ఎదురవుతుంది. దీంతో గ్రామంలోని ఈ ప్రదేశాల వద్ద ఎప్పటికప్పుడు వాహనాలు నిలిచిపోవడం పరిపాటిగా మారింది. దీని వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడి వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం పోలీసు అధికారులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జగ్గంపేట: జగ్గంపేట నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన జగ్గంపేటలో సంతరోజు అయిన సోమవారం అధికంగా రవాణా చేసే వాహనాలతో పాటు భారీ వాహనాలు అప్రోచ్ రోడ్డులో ప్రవేశించడం, కాకినాడ-గోకవరం రోడ్డులో అధిక శాతం వాహన రాకపోకలతో ద్విచక్రవాహనాలు, ఆటోలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ నియంత్రణ పాటించేలా ట్రాఫిక్ సిబ్బందిని 4రోడ్ల జంక్షన్లో నియమిస్తూ చర్యలుచేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రత్తిపాడు మార్కెట్ సెంటర్‌లో ట్రాఫిక్



జగ్గంపేటలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు



అమ్మవారికి భక్తులు సమర్పించిన సారె

కనకదుర్గమ్మకు ఆషాఢం సారె

సర్పవరం జంక్షన్, జూలై 13: కాకినాడ రూరల్ సర్పవరంలో ఆషాడమాసం పురస్కరించుకుని శనివారం శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో వివిధ రకాల పిండివంటలతో సారెను నైవేద్యంగా సమర్పించారు. ఆషాడమాసంలో గ్రామంలో ముత్తయిదువులు భారీగా తరలివచ్చి భక్తిశ్రద్ధలు, నియమనిష్టలతో తయారు చేయించిన మ్మవారికి ప్రీతిపాత్రమైన బూరెలు, ప్రత్యేక పిండి వంటలు, చీరలను తీసుకొచ్చారు. ఈ సారెను అమ్మవారి చెంత ఉంచి ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి సమర్పించారు. శనివారం విజయ కనకదుర్గఅమ్మవారు వారాహిమాత విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు పుల్ల స్వాములు, పుల్ల ధర్మరాజు, అడపా పద్దరాజు, మామిడాల ప్రభాకరరావు, మానేపల్లి శర్మారావు, పుల్ల రామకృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



పెద్దాపురంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెద్దాపురం, జూలై 13: స్థానిక లూథరన్ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక శనివారం ఉత్సాహంగా జరిగింది. 1967-68, 1968-69 ఎస్ఎస్ఎల్‌సీ పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి సంతోషంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను తలుచుకుంటూ ఆనందంగా గడిపి విందు భోజనాలు చేశారు. గురువులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పాఠశాలకు అవసరమైన సామగ్రిని అందచేశారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయమందిస్తామన్నారు. పారిశ్రామికవేత్తలు మట్టే సత్యప్రసాద్, గోలి రామారావు, విశ్రాంత ఉద్యోగులు బద్ది కృష్ణ, విద్యాసాగర్, థామస్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ఇబ్బందులు!



వర్షంనీటిలో మృతదేహాన్ని పాతిపెడుతున్న గ్రామస్తులు

తాళ్లరేవు, జూలై 13: నీలపల్లి పంచాయతీ పరిధి సిద్ధార్థనగర్ పక్కన ఉన్న శ్మశానవాటికలో మృతదేహాన్ని పూడ్చిపెట్టేందుకు ఎమ్ఎల్‌కె నగర్ గ్రామస్తులు శనివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పువ్వల రాంబాబు(42) అకాలంగా మృతి చెందాడు. ఇటీవల వర్షాలకు మోకాల్లు లోతు నీటిలో శ్మశాన వాటిక ఉండడంతో మృతదేహాన్ని పాతిపెట్టేందుకు చోటులేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఎక్స్‌కవేటర్ సాయంతో మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. కొన్నేళ్లుగా ఈ శ్మశాన వాటిక సమస్య పరిష్కారం కావడంలేదని గ్రామపెద్దలు పలివెల అర్జునరావు, నిమ్మ రవికుమార్ తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి శ్మశానంమెరకచేసే చర్యలు చేపట్టాలని పలువురు కోరారు.

ఆక్రమణల తొలగింపు



పిఠాపురంలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

పిఠాపురం, జూలై 13: పట్టణంలోని కుంతీమాధవ స్వామి దేవస్థానం వద్ద ఉన్న ఆక్రమణలను శనివారం పోలీసు బందోబస్తుతో తొలగించారు. ఆలయం ఉత్తర ద్వారాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో మున్సిపల్ అధికారులు పరిశీలన జరిపి వాటిని తొలగించాలని ఆక్రమణదారులకు సూచించారు. పట్టించుకోకపోవడంతో శనివారం పోలీసుల సమక్షంలో అక్కడ ఉన్న ఆక్రమణలు తొలగించి మినీ జేసీబీతో చదును చేశారు. అయితే ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగించలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగించేదెన్నడో!

సామర్లకోట, జూలై 13: సామర్లకోట మున్సిపాల్టీ షాపింగ్ సముదాయాల వద్ద కొందరి ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నా టౌన్‌ప్లానింగ్, మున్సిపల్ అధికారులు ఏ చర్యలు తీసుకోకపోవడంతో రోజురోజుకూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయన్న ఆరోపణలు అనేకం ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కాపు కల్యాణ మండపం వద్ద ఇటీవల కొందరు షాపింగ్ లీజుదారులు తమ షాపుల వెనుక భాగంలో పెద్దఎత్తున ఆక్రమించి ఇనుపరేకులతో షెడ్‌లను వేసి గోదాములుగా మార్చగా ఇటీవల ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆక్రమణలను పరిశీలించి సత్వరం తొలగించాల్సిందిగా కమిషనర్‌ను ఆదేశించారు. అయినా నేటికీ అధికారులు ఆక్రమణలు తొలగించ లేకపోయారు. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణలపై చర్యలు తీసుకోకుంటే మరింత పెరిగే అవకాశం ఉంది.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దాపురం, జూలై 13: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిరాజప్ప అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన రాజప్ప ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలను అడిగి తెలుసుకున్నారు. సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇంతవరకూ జరిగిందంతా ఇక చర్చించుకోవడం అనవసరమని, అధికారులు నిర్లక్ష్యధోరణి విడనాడి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. అలాగే తాగునీరు సక్రమంగా అందించాలన్నారు. ఇప్పటివరకూ గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ఇకపై నిధుల కోసం తాను చూసుకుంటానని అభివృద్ధిపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలన్నారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో ఎం.ఉషారాణి, జడ్పీటీసీ గవరసాన సూరిబాబు, ఏపీవో పి.సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనకు సర్వేకు సంబంధించిన ఫ్లెక్సీని రాజప్ప ఆవిష్కరించారు.

విమర్శించే స్థాయి ముద్రగడకు లేదు

కాకినాడలో ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న గోకేడ రాంబాబు తదితరులు

కాకినాడ సిటీ, జూలై 13: కాకినాడ ఎంపీగా 1999లో పునర్జన్మనిచ్చిన సీఎం చంద్రబాబును, కౌలు రైతులకు రూ.30కోట్ల సొంత నిధులు పరిహారంగా ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శించే స్థాయి కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంరెడ్డికి లేదని ఉభయ తూర్పుగోదావరి జిల్లా కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోకేడ రాంబాబు ధ్వజమెత్తారు. కాపు రిజర్వేషన్లపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను విమర్శిస్తూ ముద్రగడ మాట్లాడిన తీరును నిరసిస్తూ కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయన ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ముద్రగడ మాట్లాడే తీరుకు, చేస్తున్న పనులకు ఏ మాత్రం పొంతన ఉండదన్నారు. 2019 నుంచి 2024 వరకు కాపులకు రిజర్వేషన్ ఇవ్వనని చెప్పిన జగన్‌రెడ్డిని ప్రశ్నించకుండా ముద్రగడ ఎందుకు మిన్నకుండిపోయారన్నారు. పవన్‌కల్యాణ్ పిఠాపురంలో పోటీ చేస్తానంటే మద్దతు ఇవ్వకుండా అతన్ని ఓడించకపోతే పేరు మార్చుకుంటానని చేసిన శపథం వెనుకకారణాలు ఏంటో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కాపు యువత నాయకులు ముమ్మిడి విష్ణు, నాగుమళ్ల బెనర్జీ, పెద్దిరెడ్డి ఆదిత్య, అడపా అర్జున్, దారపురెడ్డి కిషోర్, పసుపులేటి సత్తిబాబు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకుతో తాగునీరు అందిస్తాం

గొల్లప్రోలు కమిషనర్ రవికుమార్



కుళాయిలకు మరమ్మతుల దృశ్యం

గొల్లప్రోలు, జూలై 13: పట్టణంలోని ఈబీసీ కాలనీలో నిరుపయోగంగా మారిన ఓవర్‌హెడ్ ట్యాంకును వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు తాగునీటిని అందిస్తామని నగరపంచాయతీ కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఈ ఓవర్ హెడ్ రిజర్వాయర్ తుప్పలు, పిచ్చిమొక్కలతో అధ్వాన పారిశుధ్యం మధ్య ఉండడాన్ని పరిశీలించిన మున్సిపల్ ఆర్డీ నాగనరసింహరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సుధాకర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిషనర్ రవికుమార్, ఏఈ ప్రభాకర్ దగ్గరుండి ట్యాంక్ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు కుళాయిలు, పైపులైనులకు మరమ్మతులు నిర్వహించారు. ఈబీసీ కాలనీ పరిధిలో పైపులైన్లకు 2లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేపట్టారు. అన్ని పనులు పూర్తి చేసి సోమవారం నాటికి ట్యాంకు ద్వారా కాలనీ ప్రజలకు తాగునీరు అందిస్తామన్నారు. అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా విధులకు హాజరు కాని ఎమినిటీస్ సెక్రటరీలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నిత్యం పగిలిపోతున్న రక్షిత మంచినీటి పైప్‌లైన్

కొత్తపల్లి, జూలై 13: వాకతిప్ప సూరప్ప చెరువులో నాగులాపల్లి ఏరియా రక్షిత మంచినీటి పథక ప్రధాన పైప్‌లైన్ నిత్యం పేలిపోతోంది. దీంతో రోజూ గ్రామాలకు మంచినీటిని పంపింగ్ చేసే సమయంలో ఎక్కడోకక్కడ ప్రధాన పైప్‌లైన్ పేలిపోవడం జరుగుతోంది. పథక నిర్వాహకులు పైప్‌లైన్ లీకులను సరి చేసి మళ్లీ నీటిపంపింగ్ చేసిన క్షణాల్లోనే మరొక చోట పైప్‌లైన్ పగిలిపోతుంది. 4 రోజుల కిందట కొత్తపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో దాబా వద్ద మెయిన్ పైప్‌లైన్ లీకు ఏర్పడింది. లీకులను సరిచేసిన అనంతరం మళ్లీ నీటిని పంపింగ్ చేస్తుండగా కూత వేటు దూరంలో మరలా పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. మరికొంత దూరంలో మళ్లీ పైప్‌కు లీక్ ఏర్పడింది. దీంతో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ప్రధాన పైప్‌లైన్ తరచూ పగిలిపోవడంతో వేరే పైప్‌లైన్ ఏర్పాటుచేయాలని ప్రజలుప్రభుత్వాన్ని కోరుతున్నారు.



యండపల్లి జంక్షన్ సమీపంలో రక్షిత మంచినీటి మెయిన్ పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకు

గోతులు పూడ్చేదెప్పుడు!



సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో గోతులు

సామర్లకోట, జూలై 13: పట్టణ పరిధిలో అటు పెద్దాపురం, పిఠాపురం రోడ్లు పెద్దపెద్ద గోతులతో ప్రమాద భరితంగా మారాయి. వారంరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ద్విచక్రవాహనదారులు ఆ గోతుల్లో పడి ప్రమాదాల పాలవుతున్నారు. పెద్దాపురం రోడ్డులో విఘ్నేశ్వరా థియేటర్ సమీపాన 2 ప్రాంతాల్లో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల మండల పరిషత్ సమావేశంలో రోడ్ల దుస్థితిపై పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆర్అండ్‌బీ అధికారులను నిలదీశారు. రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పెట్టామని వారంలో నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆర్అండ్‌బీ ఏఈ వెల్లడించారు. ఇది జరిగి పది రోజులు కావస్తున్నా నేటికీ రోడ్లు మరమ్మతులు చేపట్టలేదు. జిల్లా ఉన్నతాధికారులు సత్వరం స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడ నీరు అక్కడే!

ఏలేశ్వరం, జూలై 13: పట్టణంలో వర్షం వస్తే ఎక్కడ నీరు అక్కడే ఉండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండడంతో చినుకు పడితే చాలు మెయిన్ రోడ్డు, క్వారీపేట, పాత బస్‌స్టాండ్, ఆర్టీసీ కాలనీలో వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోతుంది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతున్నారు.



ఏలేశ్వరంలో వర్షపు నీటితో మునిగిన రోడ్డు

బియ్యం, కందిపప్పు విక్రయాలు ప్రారంభం



గొల్లప్రోలులో విక్రయాలను ప్రారంభిస్తున్న నాయకులు

గొల్లప్రోలు, జూలై 13: పట్టణంలో ఎంపిక చేసిన కిరాణా దుకాణాల వద్ద కందిపప్పు, బియ్యం విక్రయాలను టీడీపీ, జనసేన నాయకులు శనివారం ప్రారంభించారు. కిలో కందిపప్పును రూ.160, నాణ్యమైన బియ్యాన్ని రూ.48కు ఈ దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా విక్రయిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు గుండ్ర సుబ్బారావు, పర్ల రాజా, బస్సా సత్యనారాయణ, శీరం మాణిక్యం, వినుకొండ అమ్మాజీ, గుళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన టీడీపీ నేతలు



రౌతులపూడి, జూలై 13: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని టీడీపీ నేతలు సర్పంచ్ పైల సీత, ఎంపీటీసీ సోమరౌతు రవి, మాజీ సర్పంచ్ పైల పైడిరాజు అన్నారు. శనివారం బలరామపురంలో మునసిబు చెరువు గట్టుపై బలరామపురం చారిటబుల్ ట్రస్ట్ అందించిన కొబ్బరి మొక్కలు నాటారు. టీడీపీ సీనియర్ నేత కోటిపల్లి నాగేశ్వరరావు, కాకి సత్యనారాయణ, పైల నాయుడు, కోరుప్రోలు సత్యనారాయణ, యదగాను నాగేశ్వరరావు, కేవీ.రమణ, పైల శ్రీను ఉన్నారు.

'హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ'

తుని రూరల్, జూలై 13: హెల్మెట్ తలకు భారం కాదని, ప్రాణాలకు రక్షణ అని తుని సీఐ గీతా రామకృష్ణ స్పష్టం చేశారు. తునిలో ద్విచక్రవాహనాలను తనిఖీ చేసి వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకత, ప్రమాదాలకు గల కారణాలు వివరించారు. పట్టణ ఎస్ఐ, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహార కిట్లు

ప్రత్తిపాడు, జూలై 13: ప్రత్తిపాడులోని బజారువీధి రామాలయం వద్ద శనివారం ఎస్ఎంఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద చిన్నారులు, విద్యార్థులకు పోషకాహార కిట్లను స్థానిక షిర్డిసాయి జ్యూయలర్స్ అధినేత పడాల శ్రీనివాస రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు, చిన్నారులతో సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఛాయ చిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ, ఎస్ఎంఎస్ సేవా సంస్థ ప్రతినిధులు జి.సత్యానందం, సోమేశ్వరరావు, బేరి రాంబాబు, జగదీశ్వరి, మణికంఠ జ్యోతి, కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సర్పవరం జంక్షన్, జూలై 13: స్థానిక ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ సఖి అధ్యక్షురాలు కొడాలి ఉమాదేవి ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న వారికి ప్రతీ నెలా నిత్యావసర సరుకులు, పౌష్టికాహారం అందిస్తున్న క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు ఎన్ నాగలక్ష్మి, రమణి, శ్రీవాణి, అడబాల రత్నప్రసాదరావు, సీహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి, జూలై 13: సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నందు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించిన 5రోజుల నైపుణ్యాభివృద్ధి సదస్సు శనివారంతో ముగిసింది. డాక్టర్ అఖిలేష్‌కుమార్ సింగ్ నేతృత్వంలో డాక్టర్ అబ్బిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, చిట్టూరి రాంప్రసాద్, చింతలపాటి పవన్‌కుమార్ శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

మురుగుకాలువలో పూడికతీత

తాళ్లరేవు, జూలై 13: తాళ్లరేవు అంబేడ్కర్ భవనం నుంచి ఆత్రేయగోదావరి వరకు ఉన్న మురుగుకాలువలో టీడీపీ నేత గంజా సూరిబాబు ఆధ్వర్యంలో రైతులు ఎక్స్‌కవేటర్‌తో పూడికతీతను శనివారం తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చేలు మునిగిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మురుగుకాలువను ఎక్స్‌కవేటరుతో తవ్వించడంతో రైతులంతా సంతోషం వ్యక్తం చేశారు.

జనసైనికుల సాయం

కొత్తపల్లి, జూలై 13: కొత్తపల్లి జనసైనికులు శనివారం ముగ్గురు అనారోగ్య బాధితులకు నగదు సాయం అందించారు. కొత్తపల్లికి చెందిన గవరబాబులకు రూ.10వేలు, పురంశెట్టి నరసింహమూర్తి, జి.వీరబాబులకు రూ.5వేల చొప్పున నగదును అందజేశారు. గవర రాంబాబు, చింతలపూడి రమణ, కొణమర్తి రాంబాబు, సానా లోవరాజు, గణేసుల సతీష్, ఎజ్జి వీరబాబు, బోడపాటి మోహన్, వీరబాబు, చక్ర, రమేష్, చిన్న, ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగ్గంపేట, జూలై 13: రామవరం గ్రామానికి చెందిన ఒక్కపాటి రాజు తల్లి ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాన్ని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. రామవరం ఎంపీటీసీ దొడ్డశ్రీను, జగ్గంపేట యువత అధ్యక్షులు మొగిలి గంగాదర్, బాపన్నదొర, గోకెడ ప్రసాద్, కాయల మణికంఠ, రేపూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.